
# ఏ జన్మకైనా ఇది చాలు...!

-కోరం రాజబాబు

**రోజూ అతను కలిపే అన్నం ముద్దలో కన్నీళ్ళు పడతాయి. అందులో ఏ కూర ఉందో, ఏ పులుసు ఉందో అతనాలోచించడు. ఆశగా, ఆతృతగా తింటాడు. తిని బతకడంవల్ల మరెవరికో ఉపయోగం ఉందని కాదు. నిజానికి అతనికే ఉపయోగపడని జీవితమది. ప్రతిరోజూ ఆ కన్నీళ్ళెందుకంటే... ఆ కళ్ళలో కృతజ్ఞతాభావం దాచుకోలేక.**





తిన్న నాలుగు ముద్దలు అతని ఆకలిని తీరుస్తాయి. ఆ తర్వాత చాప, దుప్పటి తీసుకుని పెరట్లో వేసుకుని పడుకుంటాడు. ఆకాశంలో చుక్కల్ని చూస్తూ ఎప్పటికో నిద్రపోతాడు. అతని పేరు స్వామి.

ఇప్పుడతని వయసు అరవై ఐదు పైమాటే. ఓపిక లేదు. ఆరోగ్యం అంతంత మాత్రమే. వయసులో ఉన్నప్పుడు ఆడిన రెక్కలు ఇప్పుడు నీరసించిపోయాయి. రెక్కలొచ్చిన పిల్లలేమో ఎగిరెళ్ళిపోయారు. అతను మాత్రం ఒంటరిగా మిగిలిపోయాడు జ్ఞాపకాల ఒడిలో నిద్రపోతూ. భౌతికంగా ఒంటరిగా ఉన్నా మానసికంగా అతని కోసం ఓ నీడ దొరికింది. జ్ఞాపకాలను పంచుకునే స్నేహం దొరికింది.

అతని ఇరవై యేళ్ళ వయసప్పటి రోజుల్లోకి తొంగి చూస్తే... అతను అందగాడు. అతని ముఖం, వొడ్డూ, పొడుగూ పౌరాణిక వేషాలకు చక్కగా అమరేది. మీసకట్టు పెడితే గంభీరంగా కన్పించేవాడు. మాట, ఉచ్చారణ కంచులా మ్రోగేవి.

ఆ రోజుల్లో అతనో క్రేజ్. ఆడాళ్ళకు అతని వేషం చూడాలంటే భలే పిచ్చి. మగాళ్ళయితే ఈర్ష్యపడేవారు. అభినయంలో అతను దిట్ట. ప్రేక్షకులను కదలనీయకుండా చేసేవాడు. అన్ని పాత్రలనూ స్టేజీ మీద రక్తికట్టించేవాడు. నాటకరంగంలో అతను కచ్చితంగా గొప్పవాడు. సంపాదించిన సొమ్ముతో పిల్లల్ని చదివించి ప్రయోజకుల్ని చేస్తే స్వార్థం మూటకట్టుకొని పారిపోయారు.

అతను స్టేజీ దిగి జీవితం వైపు చూసేసరికి ఏమీ మిగల్లేదు. తెర మూసుకుపోయింది. పేరు మాత్రం నేనున్ననంటూ వొంటిని అంటుకునే ఉంది. ఎంతకాలం ఆ పేరును మోస్తాడతను? అందుకే అన్నీ వదిలేసి బయలుదేరాడు.

నిజానికి అతనికో గమ్యం లేదు. ఎలా బతకాలో తెలీదు. అర్థంకాని జీవితం... అందనంత ఎత్తుకెళ్ళి కిందకు జారిపోయిన జీవితం. అందుకే... వొంటరిగా... ఏదన్నా దారి దొరక్కపోతుందా అన్న ఆలోచనతో... ఆశతో వెళుతున్నాడు. రైలెక్కి చాలా సేపయ్యింది. అతనికి అదేమీ తెలియడంలేదు.

ఎక్కడ దిగాలి?

ఎక్కడో ఓ చోట దిగాలి. టికెట్ ఎక్కడికి కొన్నాడో అక్కడే దిగాలి అనుకున్నాడే గాని చాలా దూరం వెళ్ళిపోయాడు. రైలు కూడా అక్కడే ఆగిపోయింది. ఇక ముందుకెళ్ళదు. ఆ విషయం అతనికి తెలీదు పాపం అందుకే ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. అనుకోకుండా ఆ బోగీ నుండి దిగుతున్న మరో వ్యక్తి చూశాడతన్ని. అతని పేరు రామశాస్త్రి. ఏమీ అర్థంకాక బిక్కుబిక్కుమంటూ చూస్తున్న స్వామిని అడిగాడతను ఎక్కడికెళ్ళాలని. అతను మౌనంగా ఉన్నాడు. జవాబివ్వలేకపోయాడు.

'చూడండి. మీరెక్కడికెళ్ళాలో నాకు తెలీదు. ఈ రైలు ఇక ముందుకెళ్ళదు. నా సహాయం ఏమన్నా కావాలా?' ఎదురుగా కూర్చుంటూ అడిగాడు రామశాస్త్రి.

అప్పటికి తేరుకుని... 'ఇక ముందుకెళ్ళదా?' అన్నాడు ఆందోళనగా. రామశాస్త్రికి అతని పరిస్థితి ఏమీ అర్థంకాలేదు. మరొక అనుమానం ఏమిటంటే అతన్నెక్కడో చూసినట్లనిపిస్తోందతనికి. వయసులో అతనికన్న కాస్త చిన్నవాడు రామశాస్త్రి.

'మీరు ఏమీ అనుకోనంటే రండి... రైలు దిగి మాట్లాడుకుందాం. కాసేపుంటే ఈ రైలు తిరిగి వెళ్ళిపోతుంది' అన్నాడు రామశాస్త్రి. ఏమీ మాట్లాడకుండా చేతి సంచి తీసుకుని రైలు దిగాడు స్వామి అతనితోపాటు.

'మిమ్మల్ని ఓ మాటడగనా?' రామశాస్త్రి అడిగాడు.

'అడగండి. అయినా నా గురించి ఎందుకు మీకు శ్రమ?'

'అదేం లేదు... మీ పేరు?'

'నన్ను స్వామి అంటారు. పూర్తిపేరు వీరాస్వామి. మీరు పౌరాణిక వేషాలు వేసేవారు కదా!'

'అవును. నాటక రంగంలో నా పేరు తెలీనివారుండరు. అయినా నా గురించి ఏం చెప్పమంటారు?'

ఓపిక లేనట్లు అన్నాడు.

'మీరేమీ చెప్పొద్దు. నాకు నాటకాలంటే ఇప్పటికీ భలే ఇష్టం. మా వూరు తెనాలి. నాటకాలకు పెట్టింది పేరు. మీ నాటకాలు నేను చాలా చూశాను. ఇప్పుడు వెంటనే మిమ్మల్ని గుర్తించలేక పోయాను. క్షమించండి' అన్నాడు రామశాస్త్రి అతనికి నమస్కరిస్తూ.

'అయ్యయ్యో... నాకెందుకు నమస్కరిస్తారు. నేనేమంత గొప్పవాడ్ని? మిమ్మల్ని అనవసరంగా ఇబ్బంది పెట్టినట్టున్నాను. మీరు వెళ్ళిరండి. మీ అభిమానానికి కృతజ్ఞతలు' అన్నాడు స్వామి.

'అలా అనకండి. మీతో ఇంతసేపు మాట్లాడే అదృష్టం కలిగింది. నాకదే చాలు. మీరేదో ఇబ్బందిలో ఉన్నట్టున్నారు. అదేంటో చెబితే నాకు చాతనైన సహాయం చేస్తాను' అన్నాడు రామశాస్త్రి.

స్వామికి కళ్ళు చెమర్చాయి. అతని అభిమానానికి. మనసు విప్పి మాట్లాడేందుకు ఇంతవరకూ ఎదురుచూసిన స్వామి గుండెల్లో బాధంతా బయటకు వచ్చేసింది. వెంటనే సర్దుకుని 'మిమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి కాదు... నా గుండె బరువు తగ్గించుకోటానికి నా గురించి చెప్పాను. మీరేమీ అనుకోవద్దు' అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

'అలాంటిదేమీ లేదు. మీ కభ్యంతరం లేకపోతే నాతో రండి. మీ మీద జాలితో కాదు చెబుతుంది. మీ మీద, నాటకరంగం మీద ఉన్న గౌరవంతో' అన్నాడు రామశాస్త్రి.

స్వామి బదులు చెప్పలేదు.

* * *

'ఈ ఇల్లు మీదే అనుకోండి. నేను బ్రాహ్మణుడ్ని. మా ఆచారాలు మీకు నచ్చుతాయో లేదో... ఏ మాత్రం ఇబ్బంది లేకుండా మీరుండండి. నాకు ఉన్నది ఒక్కగానొక్క చెల్లెలు. దురదృష్టవంతురాలు. భర్తపోయి నాలుగేళ్ళయింది. నా భార్య చనిపోయి ఒక ఏడాది కావస్తోంది. కొడుకు పట్నంలో ఉద్యోగంలో చేరిపోయాడు. మిగిలింది నేనూ, నా చెల్లెలు. మాలో ఒకరిగా మీరూ ఉండిపోవచ్చు' అభిమానంగా అన్నాడు రామశాస్త్రి.

స్వామికి అంతా కలగా ఉంది. తిరిగి స్టేజీ ఎక్కినంత సంబరపడిపోయాడతను. గుండె నిండా రామశాస్త్రి పట్ల కృతజ్ఞతా భావం నిండిపోయిందతనిలో.

★ ★ ★

రెండేళ్ళు గడిచిపోయాయి. ఈ రెండేళ్లలో ఎప్పుడూ ఆ ఇంటి నుండి వెళ్ళిపోవాలని అతననుకోలేదు. ఆ ఇంటితో అతనికున్న అనుబంధం చెట్టులా పెరిగిపోయింది. మానవత్వం ఆ ఇంటి సొంతం అయిపోయింది.

విచిత్రం ఏమిటంటే అతని పిల్లలెప్పుడూ గుర్తుకు రాకపోవడం. కాని... స్వామికున్న బాధ ఒక్కటే!

ఆ కుటుంబానికి తనేమీ చేయలేక పోతున్నానే అని. రెండు పూటలా అన్నం తింటూ ఆ ఇంటి బాధ్యత అన్నా తీసుకోకపోవడం అతన్ని కృంగదీస్తోంది.


ఎన్నోసార్లు అదేమాట రామశాస్త్రితో అన్నాడు స్వామి. రామశాస్త్రి చిర్నవ్వుతో దాన్ని కొట్టిపారేసేవాడు.

ఓ రోజు స్వామి పెరట్లో కూర్చుని దీర్ఘాలోచనలో ఉండగా రామశాస్త్రి వచ్చాడు.

'ఏంటో ఆలోచిస్తున్నట్టున్నారు. మీకో శుభవార్త తీసుకొచ్చాను' అన్నాడు రామశాస్త్రి.

'ఏంటది?' అంటూ కుర్చీలోంచి లేచాడు స్వామి.

'ఇదిగో ఈ కాగితం చూడండి. ప్రభుత్వం మీకు ప్రతి నెలా అయిదొందల రూపాయలు ఇస్తుందట. ఈ వయసులో అంత సాయం గొప్పదే కదా! వృద్ధాప్యంలో ఇలా ఆదుకోవడం చాలా గొప్ప విషయం' అంటూ ఆ కాగితాన్ని స్వామి చేతికిచ్చాడు రామశాస్త్రి.



ఎప్పటిలాగే స్వామి అన్నం కలుపుతున్నాడు.
కన్నీళ్లు అన్నంలోకి జారిపడుతున్నాయి.
ఆ అన్నం తింటుంటే రోజూ కన్నా రుచిగా,
మధురంగా అన్పించిందతనికి. ఈ జన్మకే కాదు
ఏ జన్మకైనా ఇది చాలు అనుకుంటూ
కళ్ళు మూసుకున్నాడు స్వామి.

స్వామికి నిజంగా అదొక అద్భుతంగా కన్పిస్తోంది. ఎప్పుడూ ఊహించని విషయమది. అసలెలా జరిగిందో అర్థం కాలేదతనికి. రామశాస్త్రి, తను చేసిందేమిటో ప్రభుత్వానికి దరఖాస్తు ఎప్పుడు పెట్టాడో చెప్పేవరకూ అర్థం కాలేదతనికి. రామశాస్త్రి చేసిన ఉపకారానికి స్వామి కళ్ళు అభినందనలు కురిపించాయి. గుండెలు స్రవించాయి. మనసారా అతన్ని ఆలింగనం చేసుకున్నాడు.

* * *

'స్వామిగారూ... మీకొక ఆధారం ఇప్పుడు దొరికింది. ఇన్నేళ్ళు మిమ్మల్ని మాతో ఉంచుకున్నందుకు మాకు దొరికిన తృప్తి చాలా ఎక్కువ. మాటల్లో చెప్పలేనిదది. మా ఇబ్బందులు ఏమున్నాయో తెలీకుండానే మాతో ఒకనిగా మిమ్మల్ని కలుపుకున్నాం. మీకిప్పుడు కొంత ఆర్థిక సౌకర్యం ఏర్పడింది. ఒకవేళ తప్పని పరిస్థితుల్లో మా దగ్గర ఉన్నానని మీరనుకుంటే మీకు నచ్చినట్లు చేయొచ్చు...' రామశాస్త్రి ముఖాన్ని గంభీరంగా మార్చుకుంటూ అన్నాడు.

స్వామికి అర్థమయింది రామశాస్త్రి ఎందుకలా అంటున్నాడు. వెంటనే అతని దగ్గరగా వెళ్ళి కూర్చుని... 'మీరేమంటున్నారు? నన్ను వెళ్ళిపొమ్మంటున్నారా? ఈ అనుబంధాల్ని, ఆప్యాయతల్ని తెంచేసుకోనా? ఆ డబ్బును నేను కోరుకున్నానా? భగవంతుని రూపంలో నన్ను మీరు ఆదుకున్నారు. మీ కృషివల్ల ఆ డబ్బు వచ్చింది. అయినా నన్ను వెళ్ళిపొమ్మనే అధికారం మీకెక్కడిది? ఈ ఇంట్లో నాకూ హక్కుంది. మీ అభిమానాన్ని, ప్రేమను పొందే హక్కుంది. మీరేమీ అనుకోనంటే నాదో మాట. నాకు ప్రతినెలా వచ్చే ప్రభుత్వ సహాయం ఈ ఇంట్లో ఉన్న చెల్లెమ్మకు దక్కుతుంది. నన్ను అమ్మలా ఆదరించింది. నా ఆకలిని తీర్చింది. మీరింకేమీ మాట్లాడొద్దు. నాకు రెండుపూటలా. రెండు ముద్దలు పెట్టండి చాలు' అంటూ రామశాస్త్రి చేతులు పట్టుకున్నాడు స్వామి.

రామశాస్త్రి ఆందోళనగా లేచాడు. 'క్షమించండి. మిమ్మల్ని బాధపెట్టాలని కాదు. మీకెలా నచ్చితే అలాగే చెయ్యండి' అంటూ బయటికెళ్ళిపోయాడు స్వామి కళ్ళలో నిలిచిపోయిన నీళ్ళను చూడలేక.

★ ★ ★

ఎప్పటిలాగే స్వామి అన్నం కలుపుతున్నాడు. కన్నీళ్లు అన్నంలోకి జారిపడుతున్నాయి. ఆ అన్నం తింటుంటే రోజూ కన్నా రుచిగా, మధురంగా అన్పించిందతనికి. ఈ జన్మకే కాదు ఏ జన్మకైనా ఇది చాలు అనుకుంటూ కళ్ళు మూసుకున్నాడు స్వామి.

★

